
ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 1 | సంచిక: 338 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 13 మార్చి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## కుప్పకూలిన తేజస్
### సురక్షితంగా బయటపడ్డ పైలట్

2లో..

# త్వరలో కొత్త రేషన్ కార్డులు



### రెండ్రోజుల్లో రైతుబంధు నిధులు విడుదల
### ఔటర్ రింగ్ రోడ్ చుట్టూ మహిళా రైతుబజార్లు ఏర్పాటు
### క్యాబినెట్‌లో కీలక తీర్మానాలు

హైదరాబాద్, మార్చి 12 (ప్రభాత ఉదయం): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం మంత్రివర్గ సమావేశం జరిగింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ వస్తున్న రేవంత్ రెడ్డి సర్కారు..మరికొన్నింటిని అమలు చేయడానికి క్యాబినెట్ ఆమోదించింది. ఇందులో ముఖ్యంగా రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డులు లేని వారికి వంద రోజుల్లో కొత్త కార్డులు మంజూరు చేస్తామని ప్రకటించింది. అదే విధంగా మహిళా సంఘాలకు ప్రతి సంవత్సరం వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. రూ.10 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించాలని కేబినెట్ తీర్మానం చేసింది. ఇందిరమ్మ ఇళ్ల పథకంపై త్వరలో జీవో ఇవ్వనుంది. పైరవీలకు తావులేకుండా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనుంది. మొదటి విడతగా 4 లక్షల 56 వేల ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.22,500 కోట్లు కేటాయించనుంది. 16 బీసీ కార్పోరేషన్‌ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. హౌసింగ్ కార్పోరేషన్ పునరుద్ధరణకు కేబినెట్ పచ్చజెండా ఊపింది. 2008 డీఎస్సీ అభ్యర్థుల ఉద్యోగాలపై కసరత్తుకు నిర్ణయించింది. రెండు రోజుల్లో 93 శాతం రైతుబంధు నిధులు ఇవ్వనున్నట్లుగా మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాల్లో ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తోంది. ప్రజలకిచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే కొన్నింటిని అమలు చేస్తున్న ప్రభుత్వం..మరికొన్నింటిని అమలు చేయాలని మంత్రివర్గ సమావేశంలో తీర్మానించింది. ఇందులో బాగంగానే తెల్ల రేషన్ కార్డులు లేని వారికి వంద రోజుల్లో కొత్త కార్డులు మంజూరు చేయనుంది. అదే విధంగా మహిళా సంఘాలకు ప్రతి సంవత్సరం వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. రూ.10 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించాలని కేబినెట్ తీర్మానం చేసింది. మహిళ సంఘాలు చేసిన వస్తువుల బ్రాండింగ్ కోసం చుట్టూ 30 ఎకరాల స్థలం కేటాయింపు చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇందిరమ్మ ఇళ్ల పథకంపై త్వరలో జీవో విడుదల చేయనుంది. పైరవీలకు తావులేకుండా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనుంది. మొదటి విడతగా 4 లక్షల 56 వేల ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించింది. ప్రతి నియోజకవర్గానికి ..మిగతా 2లో



# మహాలక్ష్మి స్వశక్తి మహిళ పథకం ప్రారంభం

### కోటి మంది మహిళల్ని కోటీశ్వరులను చేస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 12 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆశీర్వాదం వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. మంగళవారం ఇక్కడ సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన సభలో 'మహాలక్ష్మి స్వశక్తి మహిళ' అనే పథకాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మాట తప్పకుండా, మడమ తిప్పకుండా సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారు. ప్రత్యేక రాష్ట్రం ఇస్తే.. ఏపీలో పార్టీకి తీవ్ర నష్టమని తెలిసినా మనకు రాష్ట్రం ఇచ్చారు. కేసీఆర్ పదేళ్లపాటు మహిళలు, ఆడబిడ్డలను పట్టించుకోలేదు. మహిళల ఉసురు తగిలి కేసీఆర్ పదవి పోయింది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తే.. కేసీఆర్ కుటుంబానికి కడుపుమంటగా ఉంది. ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణం వద్దంటూ ఆటో డ్రైవర్లతో ధర్నా చేయిస్తున్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే రాజీవ్ ఆరోగ్యశ్రీని కేసీఆర్ నిర్వీర్యం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆ పథకాన్ని 10లక్షలకు పెంచాం. కేసీఆర్, మోదీ కలిసి 400 ఉన్న గ్యాస్ సిలెండర్‌ను 1200 చేశారు. మహిళలకు భారం కావొద్దని మళ్లీ 500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తానని కేసీఆర్ పదేళ్లు డబ్బా కొట్టారు. పదేళ్లలో ఎంతమందికి ఇళ్లు ఇచ్చారో చెప్పాలి. మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా 100 మార్కెట్లు నిర్మించి, వారి ఉత్పత్తుల విక్రయం కోసం స్టాళ్లు ఏర్పాటు చేయిస్తాం. సీఎం కుర్చీలో పాలమూరు బిడ్డ కూర్చుంటే కొందరికి కడుపు మండుతోంది. మహిళలు ..మిగతా 2లో



చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని దర్శించుకున్న కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా, చిత్రంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి కిషన్ రెడ్డి, హైదరాబాద్ ఎంపీ బిజెపి అభ్యర్థి మాధవి లత

# చార్మినార్ భాగ్యలక్ష్మి సన్నిధిలో అమిత్ షా

హైదరాబాద్, మార్చి 12(ప్రభాత ఉదయం): ఎల్బీ స్టేడియంలో బీజేపీ నిర్వహించిన విజయ్ సంకల్ప్ సభలో అమిత్ షా పాల్గొన్నారు. అక్కడి నుంచి నేరుగా పాతబస్తీలోని చార్మినార్ సమీపంలో ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారి వద్దకు వెళ్లారు. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, బీజేపీ అగ్ర నేత అమిత్ షా హైదరాబాద్‌లోని చార్మినార్‌ను ఆనుకొని ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం తొలుత సికింద్రాబాద్ ఇంపీరియల్ గార్డెన్స్‌లో నిర్వహించిన సోషల్ మీడియా వాలంటీర్ల సబలో పాల్గొన్న అమిత్ షా.. తర్వాత ఎల్బీ స్టేడియంలో బీజేపీ నిర్వహించిన విజయ్ సంకల్ప్ సభలో పాల్గొన్నారు. అక్కడి నుంచి నేరుగా పాతబస్తీలోని చార్మినార్ సమీపంలో ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారి వద్దకు వెళ్లారు. అమ్మవారి ఆలయంలో అమిత్ షా వచ్చినందున పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. అమిత్ షా మాట్లాడుతూ.. భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో రాబోయే ..మిగతా 2లో

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఫసల్ బీమా పథకం రైతు వాటాను ప్రభుత్వమే చెల్లిస్తుంది: డాక్టర్ జి చిన్నారెడ్డి**
**వ్యవసాయ మంత్రి కావాలన్నా కోరిక నెరవేరలేదు: డాక్టర్ జి చిన్నారెడ్డి**
**పరిశోధనా ఫలాలు రైతుకు చేరాలి**



వ్యవసాయ శాఖ అధికారులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రాజేంద్రనగర్, మార్చి12(ప్రభాత ఉదయం) రైతు కష్టాన్ని తెలుసుకుని రైతుల సంక్షేమం కోసం పనిచేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ లోని జాతీయ వరి వ్యవసాయ పరిశోధన కేంద్రంలో రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ గా నియామకమైన డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి సన్మాన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.... ప్రభుత్వ ఆశయాలు, లక్ష్యాలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు బాగా పనిచేసినప్పుడే వ్యవసాయ శాఖకు నాకు మంత్రి గా మంచి పేరు వస్తుందని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలని సంకల్పంతో ఆనాడే డాక్టర్ చిన్నారెడ్డి 41 మంది ఎమ్మెల్యేలతో సోనియాగాంధీకి వినతి పత్రం అందజేశారని గుర్తు చేశారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆ దిశగా వ్యవసాయ శాఖ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రూపొందించిన ..మిగతా 2లో



# ముఖ్యమంత్రి మాట్లాడే భాష ఇదేనా?

### కరీంనగర్ కదనభేరిలో బీఆర్ఎస్ అధినేత

హైదరాబాద్, మార్చి 12 (ప్రభాత ఉదయం): ముఖ్యమంత్రిని ఆరు గ్యారంటీలు, కరెంటు మాయమైంది.. నీళ్లెందుకు మాయమైతున్నయ్ అంటే.. ఆయన నేను పండవొట్టి తొక్కుత.. పేగులు మెడల వేసుకుంట.. పెండ మోకానికి రాసుకుంట.. చీరుత.. సంపుత.. మానవ బాంబునైత.. మట్టిబాంబునైత అని మాట్లాడుతున్నడు. ఇంత అసహనమా..? అంటూ బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావు మండిపడ్డారు. కరీంనగర్ కదనభేరిలో బీఆర్ఎస్ అధినేత పాల్గొన్నారు. 'తెలంగాణ ఆశలు అడియాసలై దిక్కుతోచని స్థితిలో, భయంకరమైన కరువు కాటలతో కరెంటు కోతలతో.. ఆత్మహత్యలకు, వలసలకు ఆలవాలమైన తెలంగాణ.. ఇగ ఎక్కడైతది తెలంగాణ.. దశ దిశ లేకుండా అన్నమో రామచంద్ర అని అలమటించాం. ఆ రోజు ఎవరికీ విశ్వాసం లేదు. తెలంగాణ అనే మాటనే అసెంబ్లీలో మాట్లాడవద్దనే ఆంక్షలు' ఉండేవని ..మిగతా 2లో

## 10 'వందే భారత్'లకు మోదీ పచ్చ జెండా!





2

### హర్యానా కొత్త ముఖ్యమంత్రిగా
## నయాబ్ సింగ్ సైనీ



2

### హైదరాబాద్ రోడ్లపైకి
## 22 ఎలక్ట్రిక్ బస్సులు

ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి



2

# ముఖ్యమంత్రి మాట్లాడే భాష ఇదేనా?

**మొదటి పేజీ తరువాయి...**



గుర్తు చేశారు. 'ఆ రోజు నాకున్న పదవులన్నీ విసిరివాళ్ల మొఖానపడేసి తెలంగాణ కచ్చితంగా నిలబడాలి.. కలబడాలి.. సొంత రాష్ట్రం కావాలి.. సొంత రాష్ట్రమైతే తప్ప దిక్కులేదని.. ఒక్కడిగా.. సైన్యంగా.. పిడికెడు మందితో జై తెలంగాణ అని బయలుదేరినం. హైదరాబాద్‌లో చర్చోపచర్చలు. ప్రజల్లోకి వెళ్లాలి.. ప్రజాగర్జన కావాలి. బ్రహ్మాండమైన చైతన్యవంతులైన ప్రజలున్న జిల్లా కరీంనగర్ జిల్లా. ఇది పోరాటాల గడ్డ. ఇక్కడి నుంచే ప్రారంభించాలని చెప్పి ఇదే ఎస్సారార్ కళాశాల మైదానంలో.. ఇదే రాత్రి సమయంలో మే 17న 48 డిగ్రీల ఎండ. అయినా తెలంగాణ ఉద్యమం కోసం ఊపిరిలూదాలని వస్తే ఆ నాడు వస్తే తెలంగాణ జెండాను ఆకాశమంత ఎత్తు ఎత్తిన గడ్డ ఈ గడ్డ. ఈ కరీంనగర్ గడ్డ మట్టినే బొట్టుగా పెట్టుకొని.. పిడికిలెత్తి కార్యాచరణ చెప్పి ఉద్యమం కోసం బయలుదేరిన. ఆ తర్వాత కథంతా మీకు తెలుసు. ముందుండి మీరే నన్ను నడిపించారు. కానీ, కాంగ్రెస్ పార్టీ ఎటువంటి పార్టీ. మాతోని నువ్వు గెలిచినవ్ కేసీఆర్.. నీ లెక్కేది.. బిషాద్ ఏంది అని మాట్లాడితే ఆ నాడు కేంద్రమంత్రి పదవి, ఎంపీ పదవి నేలకేసి కొట్టి రార నా కొడకా కరీంనగర్‌కు అని మళ్లీ ఇక్కడికి వచ్చిన. ఎన్ని కోట్లు ఖర్చు పెట్టారో.. ఎన్ని మాయోపాయాలు చేశారో.. మొత్తం రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని గింగిరాలు కొట్టిందే నాకంటే మీకే తెలుసు. బ్రహ్మాండంగా మరోసారి ఇది పదునైన కరీంనగర్ గడ్డ బిడ్డ.. తెలంగాణ అడ్డ అనే పద్ధతిలో 2.50లక్షల మెజారిటీతో నన్ను గెలిపించి మరోసారి తెలంగాణ చైతన్యాన్ని చాటింది ఈ గడ్డ' అన్నారు. 'పరిణామాలు జరుగుతుంటయ్. మనం తెలంగాణ సాధించినం. మంచి చేసినం. కొన్ని సందర్భాల్లో అత్యాశకో.. దురాశకో.. మరోరకంగా ప్రజలు మోసపోతరు. మొన్న కూడా మోసపోయి కాంగ్రెస్ పార్టీని గెలిపించారు. ఈ రోజు వందరోజుల్లోనే ఏం జరిగిందో ప్రజలు మీందరికీ తెలుసు. ఏం మాట్లాడుతున్నరంటే.. మేం ఎక్కువ ఇస్తం. ఆరు చందమామలు పెడుతం.. ఏడు సూర్యులు పెడుతం అని మాట్లాడింద్రు. రైతుబంధు రూ.15వేలు వేస్తం.. కల్యాణలక్ష్మికి తులం బంగారం కలిపిస్తం అన్నరు. ఇవాళ నోటికి మొక్కాలి. 420 హామీలు ఇచ్చి బయలుదేరారు. ఇవాళ ఏం మాట్లాడుతున్నరు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడుతం అని ఓ మంత్రి మాట్లాడుతున్నడు. నేను చెప్పిన బిడ్డా.. రైతుల చెప్పులు చాలా బందబస్తుగా ఉంటయ్. వాళ్లు అదే పనికి ఎత్తుకుంటే మీ గతి అని చెప్పిన. రైతుల చెప్పులు బందబస్తుగా ఉండయా..? మంత్రిగా ఉన్న వ్యక్తి రైతుబంధు అడిగితే చెప్పుతో కొడుతం అంటున్నడు. ఇంకెవడో సన్నాసి ఇంకోటి అంటడు' మండిపడ్డారు. 'ముఖ్యమంత్రిని ఆరు గ్యారంటీలు, కరెంటు మాయమైంది.. నీళ్లెందుకు మాయమైతున్నయ్ అంటే.. ఆయన నేను పండవెట్టి తొక్కుత.. పేగులు మెడల వేసుకుంట.. పెండ మోకానికి రాసుకుంట.. చీరుత.. సంపుత.. మానవ బాంబునైత.. మట్టిబాంబునైత అని మాట్లాడుతున్నడు. ఇంత అసహనమా..? ముఖ్యమంత్రి మాట్లాడాల్సిన భాషనా? పద్ధతా? తెలంగాణ రాష్ట్రానికి, సమాజానికి ఇదో గౌరవమా? దయచేసి ప్రజలు ఆలోచించాలి. కరీంనగర్ గడ్డ నుంచి యావత్ తెలంగాణ ప్రజానీకానికి నేను పిలుపునిస్తున్నారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి మానవబాంబు అయితమని మాట్లాడవచ్చునా ? మాకు మాట్లాడరాదా? తిట్టాలంటే తిట్లు తక్కువ ఉన్నయా? ఇవాళ గియాళకు మొదలుపెడితే రేపు గియాళ వరకు మాట్లాడొచ్చు. నేను మాట్లాడినా.. ఉద్యమంలో మాట్లాడాను. తెలంగాణను వ్యతిరేకించినోళ్లను దద్దమ్మలు, సన్నాసులు అన్నాను. సమైక్యవాదం.. సమగ్ర అభివృద్ధి అంటే.. సన్నాసున్నాలారా ఏదిరా అని మాట్లాడిన. నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పదేళ్లలో ఒక్కరోజు, సందర్భంలో దురుసుమాటలు విన్నరా? నేను చెప్పే మాటలపై ఆలోచించాలి. తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నాం. బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకున్నాం' అన్నారు



## మహాలక్ష్మి స్వశక్తి మహిళ పథకం ప్రారంభం

**మొదటి పేజీ తరువాయి...**

గెలిపించిన ప్రభుత్వాన్ని కూలగొట్టాలని కేసీఆర్, మోదీ కలిసి కుట్రలు చేస్తున్నారు' అని సీఎం రేవంత్ విమర్శించారు. రైతుల పంటలు కొనని నరేంద్ర మోదీకి ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. ఏటా రెండు కోట్ల మందికి ఉద్యోగాలు ఇస్తామని మోదీ చెప్పారని, సోనియాగాంధీ పార్లమెంట్ తలుపులు మూసివేసి తెలంగాణ ఇచ్చారని మోదీ విమర్శించారని అన్నారు. తెలంగాణ ఏర్పాటును మోదీ ఎన్నోసార్లు అవమానించారని రేవంత్ మండిపడ్డారు.

## కుప్పకూలిన తేజస్

### సురక్షితంగా బయటపడ్డ పైలట్

జైసల్మేర్, మార్చి 12 (ప్రభాత ఉదయం): రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో తేలికపాటి యుద్ధ విమానం తేజస్ కుప్పకూలింది. ఈ ఘటనలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదు. ఈ ప్రమాదం నుంచి పైలట్ కూడా సురక్షితంగా బయటపడ్డారు. భారత వైమానిక దళానికి చెందిన తేలికపాటి యుద్ధ విమానం (ఎల్సీఏ) తేజస్ విమానం కుప్పకూలింది. రాజస్థాన్ లోని జైసల్మేర్ లో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అయితే ఘటన నుంచి పైలట్ సురక్షితంగా బయటపడ్డారు. ఆపరేషన్ ట్రైనింగ్ సమయంలో ఈ ప్రమాదం జరిగింది.'భారత వైమానిక దళానికి చెందిన తేజస్ విమానం జైసల్మేర్ వద్ద శిక్షణ సమయంలో ప్రమాదానికి గురైంది. పైలట్ సుక్షితంగా బయటపడ్డారు.' అని వైమానిక దళం ఒక సంక్షిప్త ప్రకటనలో తెలిపింది. కాగా.. ఈ ప్రమాదానికి గల కారణాలను కనుగొనేందుకు కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. విమానం నేలకూలిన వెంటనే దానికి మంటలు అంటుకున్నాయి. దట్టమైన, నల్లటి పొగలు వెలువడ్డాయి. ఈ సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. స్థానికులను పోలీసులు అక్కడి నుంచి తరలిస్తున్నారు. పోఖ్రాన్ ఎడారికి 100 కిలోమీటర్ల దూరంలో ప్రధాని నరేంద్ర మోడీ, సైనిక ఉన్నతాధికారులు కలిసి 'భారత్ శక్తి' మెగా వార్ గేమ్ నిర్వహిస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. కల్లా రెసిడెన్షియల్ కాలనీ సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని జైసల్మేర్ అదనపు పోలీసు సూపరింటెండెంట్ మహేంద్ర సింగ్ తెలిపారు. ప్రభుత్వ రంగ ఏరోస్పేస్ దిగ్గజం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) తయారు చేసిన తేజస్ విమానం వైమానిక పోరాటానికి, వైమానిక మద్దతు మిషన్లకు శక్తివంతమైన వేదిక నిలిచాయి. తేజస్ విమానాలు ఐఏఎఫ్ కు కీలకం కానున్నాయి. ఇది ఇప్పటికే దాదాపు 40 తేజస్ ప్రారంభ వేరియంట్లను చేర్చింది.

## హర్యానా కొత్త ముఖ్యమంత్రిగా నయాబ్ సింగ్ సైనీ



హర్యానా, మార్చి 12 (ప్రభాత ఉదయం): హర్యానా నూతన ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీ ఎన్నుకుంది ఆ రాష్ట్ర బీజేఎల్పీ. మంగళవారం అక్కడి రాజకీయాల్లో ఒకదాని వెంట ఒకటి నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో సీఎం పదవికి మనోహర్ లాల్ ఖట్టర్ రాజీనామా చేయగా.. ఆయన ప్రధాన అనుచరుడైన నాయబ్ ఇప్పుడు సీఎంగా ప్రమాణం చేయనున్నారు. అంతకు ముందు.. జేజేపీ- బీజేపీల మధ్య పొత్తు తెగిపోవడంతో.. ఖట్టర్ రాజీనామా, నూతన ప్రభుత్వం ఏర్పాటు అనివార్యమైంది. అయితే ఖట్టర్ మళ్లీ బాధ్యతలు స్వీకరిస్తారని అంతా భావించగా.. అనూహ్యంగా నాయబ్ సింగ్ సైనీ పేరు తెరపైకి వచ్చింది. ప్రస్తుతం ఆయన హర్యానా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగానే కొనసాగుతున్నారు. అంతేకాదు కురుక్షేత్ర పార్లమెంటు సభ్యుడు(ఎంపీ) కూడా. ఇవాళ సాయంత్రం ఐదు గంటలకు సీఎంగా ఆయన ప్రమాణం చేయనున్నారు. ఓబీసీ కమ్యూనిటీకి చెందిన నాయబ్ సింగ్ సైనీ గత ఏడాది బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులయ్యారు. సైనీకి సంఘ్ కార్యకాలాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. 1996లో ఆయన బీజేపీలో చేరారు. ఆ తర్వాత 2002లో అంబాలా బీజేపీ యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గా ఎంపికయ్యారు. 2005లో ఆయన బీజేపీ అంబాలా యువమోర్చా జిల్లా అధ్యక్షుడయ్యారు. తరువాత బీజేపీ హర్యానా కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2012లో అంబాలా జిల్లా అధ్యక్షునిగా నాయబ్ సింగ్ సైనీ నియమితులయ్యారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో నారాయణగఢ్ నుంచి గెలిచి హర్యానా అసెంబ్లీకి చేరుకున్నారు. 2016లో ఖట్టర్ నేతృత్వంలోని హర్యానా ప్రభుత్వంలో రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో నాయబ్ సింగ్ సైనీ కురుక్షేత్ర ఎంపీగా ఎన్నికయ్యారు. 2023లో హర్యానా బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఇప్పుడు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎంపికయ్యారు.



డాక్టర్ జి చిన్నారెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం ప్రతినిధులు

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి...**

పరిశోధనలను రైతులకు క్షేత్రస్థాయిలో అందించి రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత అధికారులపై శాస్త్రవేత్తలపై ఉందన్నారు. గత ప్రభుత్వం రైతుబంధు, రైతు బీమా అంశాలనే వ్యవసాయ అధికారులకు వాడుకుందని, క్షేత్రస్థాయిలో రైతులు పండించే పంటలకు సలహాలు సూచనలు అందించే దిశగా పనిచేయలేదు అన్నారు. రైతు పండించిన పంటకు పంటకు కావలసిన అవసరాలను తీర్చలేదని, వ్యవసాన్ని నిర్వీర్యం చేసిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న ఫసల్ బీమా యోజన పథకానికి రైతు వాటా ను రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. పరిశోధనా ఫలాలు రైతులకు అందినప్పుడే రైతుకు లాభదాయకంగా ఉంటుందన్నారు. రైతులను ఫామ్ ఆయిల్ పంటపై పంటపై దృష్టి సారించే విధంగా అధికారులు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 60 లక్షల ఎకరాల విస్తీర్ణం ర్ణంలో పండిస్తున్నారని, అదేవిధంగా 50 లక్షల ఎకరాల్లో పత్తి పంటను పండిస్తున్నారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. డాక్టర్ స్వామినాథన్ ప్రతిపాదించిన రైతుల కోసం ప్రతిపాదించిన అంశాలను అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అంతకు ముందు వ్యవసాయ శాఖ అధికారుల సంఘం చైర్మన్ బి కృపాకర్ రెడ్డి, అధ్యక్షులు వైద్యనాథ్, ప్రధాన కార్యదర్శి కృపాకర్ రెడ్డి లు డాక్టర్ చిన్నారెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలను భారీ గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ఐఐఆర్ డైరెక్టర్ సుందరం, రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ బి కృపాకర్ రెడ్డి, సంఘం అధ్యక్షులు వైద్యనాథ్, ప్రధాన కార్యదర్శి కృపాకర్ రెడ్డి, డాక్టర్ విద్యాసాగర్, రిటైర్డ్ డీన్ న్ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## చార్మినార్ భాగ్యలక్ష్మి సన్నిధిలో అమిత్ షా

**మొదటి పేజీ తరువాయి...**

ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవి లతను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ పూజలో అమిత్ షాతో పాటు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవి లత తదితరులు ఉన్నారు. అమిత్ షా భాగ్యలక్ష్మి అమ్మవారి దర్శన సమయంలో మాధవి లత ప్రత్యేకంగా నిలిచారు. స్వచ్ఛమైన హిందూ సాంప్రదాయ దుస్తుల్లో ఆమె కనిపించారు. అమిత్ షా పర్యటన కోసం చార్మినార్ పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. భాగ్యలక్ష్మి ఆలయం వద్దకు చేరుకున్న హెూంమంత్రి అమిత్ షాకు ప్రత్యేక స్వాగతం లభించింది. అంతకుముందు అమిత్ షా ఎల్బీ స్టేడియంలోని సభలో మాట్లాడుతూ.. "వినాశకర విధానాలతో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ ఏకమయ్యాయి. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనాన్ని కుటుంబ వారసత్వ రాజకీయ పార్టీలు అడ్డుకోలేవు. దేశమంతా మోదీ సానుకూల పవనాలు బలంగా వీస్తున్నాయి. మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావడం ఖాయం" అని అమిత్ షా మాట్లాడారు.

## త్వరలో కొత్త రేషన్ కార్డులు

**మొదటి పేజీ తరువాయి...**

3500 ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఇందుకోసం రూ.22,500 కోట్లు కేటాయించనుంది. 16 బీసీ కార్పోరేషన్‌ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ముదిరాజ్, యాదవ కుర్మ, లింగాయత్, పద్మశాలి, పెరక, బలిజ కార్పొరేషన్ల ఏర్పాటుతో పాటు రెడ్డి, వైశ్య, మాదిగ, మాదిగ ఉపకులాల, మాల, మల ఉపకులాల కార్పొరేషన్ల ఏర్పాటు చేయడం ఏకలవ్య, బంజారా, ఆదివాసీ ల కోసం ప్రత్యేక కార్పొరేషన్ల ఏర్పాటు చేయాలని భావించింది. గీత కార్మికుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లుగా మంత్రులు తెలిపారు. హౌసింగ్ కార్పోరేషన్ పునరుద్ధరణకు కేబినెట్ పచ్చజెండా ఊపింది. 2008 డీఎస్సీ అభ్యర్థుల ఉద్యోగాలపై కసరత్తుకు నిర్ణయించింది. జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి నేతృత్వంలో విద్యుత్ కొనుగోళ్ల అంశంపై విచారణ జరపనుంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై రిటైర్డ్ జడ్జి జస్టిస్ పీసీ చంద్రఘోష్ నేతృత్వంలో విచారణ చేపట్టాలని నిర్ణయించింది. 100 రోజుల్లో విచారణ పూర్తి చేయాలని కమిటీకి సూచన చేయనుంది.రాష్ట్రంలోని లబ్దిదారులకు రెండు రోజుల్లో 93 శాతం రైతుబంధు నిధులు ఇవ్వనున్నట్లుగా మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ప్రతిపక్ష పార్టీ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను అభినందించలేక విమర్శలు చేస్తోందని ..లేని పోని అపోహలను సృష్టించి ప్రజల్ని అయోమయానికి గురి చేయాలని చూస్తోందని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## 10 'వందే భారత్'లకు మోదీ పచ్చ జెండా!

హైదరాబాద్, మార్చి 12 (ప్రభాత ఉదయం): దేశంలోని ప్రజలకు మరో పది నూతన వందేభారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయి. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ 10 నూతన వందే భారత్ రైళ్లను ప్రారంభించారు. అలాగే ఇతర రైల్వే సేవలను కూడా స్వాగతించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ భారతీయ రైల్వేలను నరకం లాంటి పరిస్థితి నుంచి బయటకు తీసుకురావడానికి తమ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. రైల్వేల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. తమ సంకల్ప శక్తికి సజీవ నిదర్శనం రైల్వేల అభివృద్ధేనని అన్నారు. దేశంలోని యువత ఎలాంటి దేశం, ఎలాంటి రైళ్లు కావాలో నిర్ణయించారన్నారు. తమ ఈ పదేళ్ల కృషి కేవలం ట్రైలర్ మాత్రమేనని, మనం మరింత ముందుకు సాగాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్, సీఎం భూపేంద్ర పటేల్, రాష్ట్ర బీజేపీ చీఫ్ సీఆర్ పాటిల్ కూడా పాల్గొన్నారు. మరోవైపు.. కొత్తవలస-కోరాపుట్,.. కోరాపుట్-రాయగఢ్ లైన్లలో రెండు డబ్లింగ్ ప్రాజెక్టులు, విజయనగరం-టిట్లాగఢ్ థర్డ్ లైన్ ప్రాజెక్ట్‌లో కొన్ని పనులు ప్రారంభించారు మోదీ. మొత్తం 85వేల కోట్ల విలువైన కొన్ని కొత్త ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 9 కార్గో టెర్మినల్స్, 11 గూడ్స్ షెడ్లు, 3 రైల్వే కోచ్ రెస్టారెంట్లు వర్చువల్‌గా ప్రారంభించారు ప్రధాని. 14 మార్గాల్లో రైల్వే లైన్ల విస్తరణకు శంకుస్థాపన చేశారు. సికింద్రాబాద్ - విశాఖ మధ్య రెండో వందేభారత్ రైలును ప్రధాని మోదీ ప్రారంభించారు. ప్రధాని మోదీ వర్చువల్‌గా రైలును ప్రారంభించగా... సికింద్రాబాద్ ప్లాట్ ఫామ్ నెంబర్ 10పై వందే భారత్ రైలుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రైల్వే ఉన్నతాధికారులు పచ్చ జెండా ఊపారు. ఈ నెల 12న ఈ రైలు ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. వారానికి ఆరు రోజుల పాటు ఈ రైలు రెండు రాష్ట్రాల మధ్య పరుగులు పెట్టనుంది. గురువారం నాడు ఈ రైలు నడవదు. వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట రైల్వే స్టేషన్లలో రైలు ఆగుతుంది. మొత్తం 530 మంది ప్రయాణికులు ఈ రైల్లో ప్రయాణించవచ్చు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నడుస్తున్న మూడో వందేభారత్ రైలు ఇది. సికింద్రాబాద్ - వైజాగ్ మధ్య రెండో రైలు కాగా... మరొకటి సికింద్రాబాద్- తిరుపతి మధ్య తిరుగుతోంది. అహ్మదాబాద్‌లోని సబర్మతిలోగల మహాత్మా గాంధీ ఆశ్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సందర్శించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొచరబ్ ఆశ్రమాన్ని, గాంధీ ఆశ్రమం మెమోరియల్ మాస్టర్ ప్లాన్‌ను కూడా ప్రధాని మోదీ ప్రారంభించారు. నేడు (మంగళవారం) ప్రధాని మోదీ గుజరాత్, రాజస్థాన్‌లలో పర్యటిస్తున్నారు.

## బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా శంభీపూర్ రాజు

హైదరాబాద్, మార్చి 12 (ప్రభాత ఉదయం): మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థిని బీఆర్ఎస్ పార్టీ ఖరారు చేసింది. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పోటీ చేయడానికి అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పోటీ నుంచి మాజీ మంత్రి మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డి తప్పుకోవడంతో శంభీపూర్ రాజుకు అవకాశం ఇస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. శంభీపూర్ రాజు.. తెలంగాణ ఉద్యమం సమయం నుంచి కేసీఆర్ వెంట ఉన్నారు. గతంలో ఆయన కుత్బుల్లాపూర్ నుంచి పోటీ చేయాలని అనుకున్నారు. కానీ గత మూడు ఎన్నికల్లోనూ చాన్స్ లభించలేదు. ఈ కారణంగా కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ టిక్కెట్ ఆశించారు. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యేలకే సీట్లు కేటాయించే క్రమంలో కేపీ వివేకానంద్ కే కేసీఆర్ టిక్కెట్ ఇచ్చారు. మొదట అసంతృప్తి వ్యక్తం చేసినా తర్వాత పార్టీ గెలుపు కోసం పని చేశారు. అదే సమయంలో మల్కాజిగిరి టిక్కెట్ ఇచ్చినప్పటికీ పార్టీని వీడిన మైనంపల్లి హన్మంతరావు ప్లేస్‌లో పోటీ చేయడానికి ఆసక్తి చూపించారు. అయితే మల్లారెడ్డి అల్లుడు రాజశేఖర్ రెడ్డి ఆసక్తి చూపడంతో ఆయనకు చాన్సిచ్చారు. ఈ కారణంగా ఎన్నికల్లో పోటీ చేయలేకపోయారు. ఇప్పుడు కూడా మల్కాజిగిరి ఎంపీ స్థానానికి మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డి పోటీ చేయాలనుకున్నారు. కానీ కాంగ్రెస్ పా ర్టీ నుంచి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉండటంతో పోటీ నుంచి విరమించుకున్నారు. ఈ కారణంగా ఎన్నాళ్ల నుంచో చూస్తున్న టిక్కెట్ శంభీపూర్ రాజుకు లభించింది. అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్ సభ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు భారీ విజయం సాధించారు. అన్ని సెగ్మెంట్లలో కలిపి మూడున్నర లక్షల ఓట్ల మెజార్టీ వచ్చింది. విజయం సునాయాసం అనుకున్నప్పటికీ అభ్యర్థులు వెనుకడుగు వేయడంతో శంభీపూర్ రాజుకు చాన్సిచ్చారు. 30 లక్షల పైచిలుకు ఓటర్లతో దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గంగా ఉన్న మల్కాజ్‌గిరి పార్లమెంట్ సెగ్మెంట్‌పై ప్రధాన పార్టీలు కన్నేశాయి. ఈ నియోజకవర్గాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. పక్కా వ్యూహంతో బీజేపీ ఈటల రాజేందర్‌ను అభ్యర్థిగా బరిలోకి దిపింది. సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ప్లాన్‌లు వేస్తున్నారు. కాంగ్రెస్ కంటే ముందే అభ్యర్థిని ప్రకటించి బీజేపీ రంగంలోకి దింపింది. కాంగ్రెస్ ఇంకా అభ్యర్థిని ఖరారు చేయలేదు.

## హైదరాబాద్ రోడ్లపైకి 22 ఎలక్ట్రిక్ బస్సులు

హైదరాబాద్, మార్చి 12 (ప్రభాత ఉదయం): తెలంగాణ ప్రభుత్వం ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ప్రయత్నిస్తోంది. రోడ్డు ట్రాన్స్ పోర్టు సంస్థ కొత్తగా 22 ఎలక్ట్రిక్ బస్సులను తీసుకొచ్చింది. తెలంగాణ ప్రభుత్వం ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ప్రయత్నిస్తోంది. రోడ్డు ట్రాన్స్ పోర్టు సంస్థ కొత్తగా 22 ఎలక్ట్రిక్ బస్సులను తీసుకొచ్చింది. హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్డులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ జెండా ఊపి ప్రారంభించారు. పాత మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల స్థానంలో 5వందల బస్సులు అందుబాటులోకి రానున్నాయి. అద్దె ప్రతిపాదికన తీసుకుంటున్న 5వందల ఎయిర్ కండిషన్డ్ బస్సులు...ఆగస్టు నాటికి ప్రయాణికులకు సేవలు అందించనున్నాయి. ఛార్జింగ్ కోసం బీహెచ్ఈఎల్, మియాపూర్, కంటోన్మెంట్, హెచ్‌సీయూ, రాణిగంజ్ డిపోల్లో 33 కేవీ పవర్ లైన్లను ఆర్టీసీ తీసుకుంది. నగరంలోని అన్ని రూట్లలోనూ ఏసీ బస్సులు నడవనున్నాయి. మరోవైపు ఆర్టీసీ సొంతంగా...565 డీజిల్ బస్సులు సమకూర్చుకోవాలని నిర్ణయించింది. 300 మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు, 140 ఆర్డినరీ బస్సులు, 125 మెట్రో డీలక్స్‌లు ఉండనున్నాయి. ఈ బస్సులన్నింటిలో మహిళలు ఉచిత ప్రయాణించవచ్చు. ఇప్పటికే ఫిబ్రవరి నెలలో 100 కొత్త బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. ఇందులో మహాలక్ష్మి పథకం కోసం 90 ఎక్స్‌ప్రెస్ బస్సులను కేటాయించామన్నారు. హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో తొలిసారి 10 ఏసీ రాజధాని సర్వీసులను నడుపుతున్నామన్న ఆయన, ఆర్టీసీ చాలా ఆరోగ్యంగా ఉందని, దానికి కారణం ప్రభుత్వమేనని కొనయాడారు. ఆర్టీసీ ఉద్యోగులు ఏడేళ్లుగా ఎదురు చూస్తున్న 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించినందుకు సీఎం, డిప్యూటి సీఎం, మంత్రులకి ధన్యవాదాలు చెప్పారు సజ్జనార్. ప్రభుత్వం ఇప్పటికే చాలా కొత్త బస్సులు విడుదల చేసిందన్న ఆర్టీసీ ఎండీ, ఇప్పుడు మరో 22 కాలుష్యరహిత బస్సులు ప్రవేశపెట్టడం సంతోషంగా ఉందన్నారు. కొత్త ప్రారంభించిన ఎలక్ట్రికల్ నాన్ ఏసీ బస్సులు మహలక్ష్మి పథకానికి అనుసందానం చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తుండటంతో...ఆర్టీసీ బస్సులు అన్ని కిక్కిరిసి పోతున్నాయి.



# వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతు నేస్తం కార్యక్రమం



రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నా రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపిలు



రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డితో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు

రాజేంద్రనగర్, మార్చి12(ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం , రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధనా స్థానంలోని ఎలక్ట్రానిక్ వింగ్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు వేదిక లలో కూర్చొని ఉన్న రైతులతో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు , ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షులు డా. జి. చిన్నారెడ్డి, వ్యవసాయ శాఖ సంచాలకులు డా. బి. గోపి లు రాజేంద్రనగర్ లోని ఎలక్ట్రానిక్ వింగ్ ద్వారా రైతులతో వర్చువల్ విధానంలో మాట్లాడారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వివిధ పంటలలో చేపట్టవలసిన యాజమాన్య చర్యలను నిపుణులైన శాస్త్రవేత్తలతో ప్రతి మంగళవారం ఉదయం 10:00 నుండి 11.30 వరకు వివరించడం జరుగుతుందని తెలిపారు. రైతులు కూడా వారికున్న సమస్యలను ఈ రైతు నేస్తం కార్యక్రమం ద్వారా తెలుసుకొని వ్యవసాయం ను లాభసాటిగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షులు డా. జి. చిన్నారెడ్డి మాట్లాడుతూ నేటి వాతావరణ పరిస్తుతులకు అనుగుణంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం లో జరుగుతున్న పరిశోధనా ఫలితాలను ఈ కార్యక్రమం ద్వారా రైతులకు అందచేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ సంచాలకులు డా. బి. గోపి మాట్లాడుతూ రైతులందరు తమ వ్యవసాయ సంబంధిత సమస్యలను వ్యవసాయ విస్తరణ అధికారులకు తెలియ చేయవలసిందిగా, వాటి ఆధారంగా శాస్త్రవేత్తల ద్వారా తగు సూచనలు, సలహాలు అందచేస్తామని తెలియ చేశారు. ఈ కార్యక్రమం లో పండ్ల పరిశోధనా స్థానం, సంగారెడ్డి సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతి అయిన డా. వి. సుచిత్ర మామిడిలో పూత రాలడానికి గల కారణాలను, తదనుగుణంగా చేపట్టవలసిన నివారణ చర్యలను సూచిస్తూ రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం నుండి డా. జి. శ్రీనివాస్, ఉత్తర తెలంగాణ మండలం సహ పరిశోధనా సంచాలకులు మాట్లాడుతూ వివిధ వేసవి పంటలలో అధిక ఉష్ణోగ్రతల వలన వచ్చే సమస్యలను వివరిస్తూ పంట దిగుబడికి ఆటంకం కలగకుండా చేపట్టవలసిన యాజమాన్య చర్యలను వివరించారు. చివరిగా సమగ్ర వ్యవసాయ పరిశోధనా విభాగం సీనియర్ శాస్త్రవేత్త, డా. సి. హెచ్. ప్రగతి కుమారి సేంద్రీయ వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ రైతు నేస్తం కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డా. ఎమ్. వెంకట రమణ, పరిశోధన సంచాలకులు డా. పి. రఘు రామి రెడ్డి , విస్తరణ సంచాలకులు డా. వి. సుధారాణి, ఎలక్ట్రానిక్ వింగ్ సమన్వయ కర్త డా. ఎమ్. శ్రీనివాసులు తో పాటుగా అన్ని జిల్లాల్లోని 110 రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ల ద్వారా రైతులు, వ్యవసాయ శాఖ మరియు అనుబంధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## హిమాయత్ సాగర్‌లో రూ. 25 కోట్లతో

# అంటువ్యాధుల నివారణ కోసం ప్రయోగశాల



అంటువ్యాధుల నివారణ అన్న అంశంపై జరిగిన సదస్సులో పాల్గొన్న వివిధ రంగాల నిపుణులు



అంటువ్యాధుల నివారణ ప్రయోగశాల నిర్మాణానికి జరిగిన భూమి పూజ లో పాల్గొన్న వివిధ రంగాల వైద్య నిపుణులు




మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడానికి కిమ్స్ హాస్పిటల్ ఐ ఐ పీ హెచ్‌కు ఇచ్చిన రూ.10 కోట్ల విలువ చేసే వాహనం, యంత్ర పరికరాలు

బుద్వేల్, మార్చి12(ప్రభాత ఉదయం) : ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే వ్యాధులు, మహమ్మారి ల నుంచి ప్రజలను కాపాడడానికి హిమాయత్ సాగర్ లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్( ఐఐపీహెచ్) ఆవరణలో రూ. 25 కోట్లతో సెంటర్ ఫర్ ఇన్ఫెక్షయస్ డిసీసెస్ అండ్ పాండమిక్ ప్రిపర్డ్ నెస్ నిర్మాణానికి ముందుకు వచ్చిందని ఐఐపిహెచ్ డైరెక్టర్ డాక్టర్ మధుబాల రెంటల తెలిపారు . సెంటర్ ఫర్ ఇన్ఫెక్షన్ డీసీసెస్ అండ్ పాండమిక్ ప్రిపర్డ్ నెస్ భూమి పూజను విల్లో పూనా వాలా ఫౌండేషన్ సీఈవో జస్విందర్ నారంగ్, ఇంటర్నేషనల్ పబ్లిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ సి శ్రీనివాసరాజు, ఐ ఐ పీహెచ్ చీఫ్ మెంటర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి , పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సంజయ్ జోడెపే, యుఎస్ఏ కు చెందిన డాక్టర్ అనిల్ కౌల్ తో కలిసి మంగళవారం చేపట్టడం జరిగిందన్నారు . అంటు వ్యాధులను ఎదుర్కోవడానికి అంకితమైన మార్గదర్శక కేంద్రంగా భవిష్యత్తులో ఐ ఐ పీహెచ్ లోని ఈ కేంద్రం పని చేస్తుందన్నారు . ప్రజారోగ్య అత్యవసర సమయాలలో అవసరమైన సమాచారం, వనరుల కల్పన , సహాయాన్ని అందించే కీలకమైన కేంద్రంగా సైనస్ పూనా వాల కేంద్రం ముందుకు వచ్చి సహకరించడం సంతోషకరమైన విషయం అన్నారు. అంటువ్యాధులలో ఆరోగ్య సంరక్షణ , పరిశోధనలకు ఇకముందు ఐఐపీహెచ్ వేదికగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ క్యాన్సర్ స్క్రీనింగ్ ఎక్స్ప్రెస్ పేరుతో సుమారు రూ. 10 కోట్ల విలువ చేసే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే బస్సును బహుకరించింది. ఈ బస్సులో ఇకమీదట జిల్లాలలోని గ్రామాలను తిరుగుతూ మహిళల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీలో ఉత్సాహభరితంగా కొనసాగుతున్న

# విద్యార్థుల అంతర్ కళాశాలల సాంస్కృతిక, సాహిత్య పోటీలు



బుర్ర కథ వినిపిస్తున్న విద్యార్థులు



నాటిక ప్రదర్శన





నృత్య ప్రదర్శనలు చేస్తున్న విద్యారినీలు

బుద్వేల్, మార్చి12(ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల అంతర్ కళాశాలల సాంస్కృతిక , సాహిత్య పోటీలు రెండవ రోజు మంగళవారం ఉత్సాహభరితంగా కొనసాగాయి. ఈ పోటీలలో 11 కళాశాలకు చెందిన 205 మంది విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను కనబరుస్తున్నారు. నృత్యాలు, పాటలు, వన్ ఆక్ట్ ప్లే, మోనో యాక్షన్, సాహిత్య పోటీలు, డిబేట్, దేశభక్తి గీతం, సృజనాత్మక పోటీల్లో రంగోలీ, పోస్టర్ మేకింగ్ ను నిర్వహించారు. ఈ పోటీలు రేపటితో ముగియనున్నాయి.



చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలసిన జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్ రావు, తదితరులు

# చేవెళ్ల ఎంపీ, స్పీకర్‌లను కలసిన జయంతి ఉత్సవాల కమిటీ ప్రతినిధులు

బుద్వేల్, మార్చి11(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యములో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి లను వారి నివాసాల వద్ద మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి ఎల్ల కాడి సూర్యం, కోశాధికారి రగడపల్లి శ్రావణ్ ల ఆధ్వర్యంలో ఎంపీ, స్పీకర్ లను కలిశారు . రాజేంద్రనగర్ సర్కిల్ లో బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు సహకారం అంద చేయాలని కోరారు. ప్రముఖులను కలసిన వారి లో వారిలో కమిటీ ప్రతినిధులు పి. జీవన్ దాస్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు వనం నర్సింహ మాదిగ , మాజీ అధ్యక్షులు టి ఆర్ శ్రీరాములు, గోల్కొండ రాజ్ కుమార్, పంబాల రాజు, పలుగుచెరువు మహేష్, జాన్ పాల్ ,శంకర్ రావు మాదిగ,ప్రీతమ్ రాజ్,చెన్నయ్య, బాబురావు,గొడుగు సంజీవ,పత్యారా రాజు,ప్రో రవీందర్,ఉపేందర్,సుమన్, నాని,గౌతమ్,అనిల్ కుమార్,పి.జంగయ్య,శివ,ప్రసాద్,పెంటయ్య,వడ్లకొండ సురేష్,ఆరంట్ల విశాల్,మనోజ్, బెంజమిన్,రమేష్ గుంటి,తదితరులు ఉన్నారు.



శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను కలసిన జయంతి ఉత్సవాల కమిటీ ప్రతినిధులు



చికిత్స పొందుతున్న నితిన్

# యువకునిపై గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడి



బుద్వేల్, మార్చి12(ప్రభాత ఉదయం) : మంగళవారం తెల్లవారుజామున అత్తాపూర్ హుడా కాలనీ వైపు స్నేహితులతో కలిసి టీ తాగడానికి నడుచుకుంటూ వెళ్తున్న నితిన్ (27 ) అనే యువకున్ని గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి గాయపరిచారు . వివరాలు ఈ విధంగా ఉన్నాయి . బీహార్ కు చెందిన నితిన్ హైదర్ గూడ లోని ఓ హోటల్ లో పనిచేస్తాడు . మంగళవారం తెల్లవారుజామున స్నేహితులు సందేశ్, సుధీర్ లతో కలిసి హోటల్ నుంచి నడుచుకుంటూ బయటికి టీ తాగడానికి వెళ్ళాడు. ఆ సమయంలో బైక్ పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు అడ్డగించి నితిన్ పై కత్తితో దాడి చేసి గాయపరిచారు . తీవ్ర రక్తస్రావాని గురైన నితిన్ నడుచుకుంటూ ముందుకు వచ్చి అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు . కేసు నమోదు చేసుకున్న పోలీసులు నితిన్ ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.



రాంబాబు ఆలయంలో స్వామి

# దేవాలయాల పరిరక్షణ కోసం ఉద్యమించాలి: కమలానంద భారతి

రాజేంద్రనగర్,మార్చి12(ప్రభాత ఉదయం) దేవాలయాల ఆస్తుల పరిరక్షణ కోసం,సనాతన ధర్మ రక్షణ కోసం ప్రజలు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని దేవాలయాల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు శ్రీ శ్రీ శ్రీ కమలానంద భారతి స్వామి పిలుపునిచ్చారు. మంగళవారం అత్తాపూర్ డివిజన్ రంభాగ్ శ్రీ దుర్గామాత ఆలయ సమితి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన జన జాగరణ కార్యక్రమంలో కమలానంద భారతి స్వామి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ...దేవాలయాలతో పాటు వాటికి సంబంధించిన భూములు,సనాతన ధర్మ పరిరక్షణకు జనంలో జాగృతం తీసుకురావడానికి తీసుకోవాల్సిన చర్యలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అపోలో హాస్పిటల్స్ డైరెక్టర్ కొండా సంగీత, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మొంద్ర సంగీత, శ్రీ దుర్గా మాత ఆలయ సమితి నిర్వాహకులు పెంటయ్య,ప్రణవభక్త సమాజం అధ్యక్షులు మొంద్రా నరసింహ,సిరి పాల్ రెడ్డి,సిద్దేశ్వర్,తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న బొల్లా శ్రీనివాస్


# శ్రీరామకృష్ణ పరమహంస ప్రచారం చేసిన మానవీయ విలువలు నేటి తరానికి ఆదర్శం

### ఘనంగా రామకృష్ణ పరమహంస జయంతి వేడుకలు

### శ్రీ రామకృష్ణ సేవాసమితి అధ్యక్షులు బొల్లా శ్రీనివాస్

రాజేంద్రనగర్,మార్చి12(ప్రభాత ఉదయం) శ్రీరామకృష్ణ పరమహంస ప్రచారం చేసిన మానవీయ విలువలు నేటి తరానికి ఆదర్శం కావాలని శ్రీ రామకృష్ణ సేవాసమితి అధ్యక్షులు బొల్లా శ్రీనివాస్ అన్నారు. భగవాన్ శ్రీ రామకృష్ణ పరమహంస జయంతి సందర్భంగా మంగళవారం మైలార్ దేవ్ పల్లి డివిజన్ పద్మశాలిపురం రామకృష్ణ సేవ సమితి ఆధ్వర్యంలో సఫాయి కర్మచారి కార్మికులకు,సివరేజ్ కార్మికులకు సుమారు 43 మందికి పురుషులకు, మహిళలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ... దేవుడు ప్రతిచోటా ఉన్నాడు కానీ అతను మనిషిలో చాలా స్పష్టంగా ఉన్నాడని,మనిషిని దేవుడిలా సేవించండి అది భగవంతుడిని పూజించినంత మేలు చేకురుస్తుందని తెలిపారు. విభిన్న మతాలు భగవంతుడిని చేరడానికి విభిన్న మార్గాలు అని అనుభవపూర్వకంగా మొట్టమొదటిసారిగా ప్రపంచానికి చాటిచెప్పిన వ్యక్తి శ్రీ రామకృష్ణ పరమహంస అని పేర్కొన్నారు. ఐశ్వర్యం, పేరు,జీవి సుఖాలు వంటి అస్థిరమైన విషయాల పట్ల మీ అనుబంధం ప్రతిరోజూ తగ్గుతూ ఉండాలని భగవంతుడిని ప్రార్థించాలని సూచించారు. మనిషికి సరైన జీవన మార్గాన్ని చూపే రామకృష్ణ పరమహంస అమూల్యమైన మాటలు చాలా ఉన్నాయని గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సేవా సమితి సభ్యులు మసున వెంకటేష్,గంజి వెంకటేష్, సేవా సమితి సభ్యులు బొల్లా శ్రీనివాస్,సిహెచ్ శ్రీనివాస్,శివ,శశి,బొల్లా నరేందర్,గ్రామస్తులు సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య



ఇర్షాద్ ఖాన్

బుద్వేల్, మార్చి12(ప్రభాత ఉదయం): తాను కుటుంబానికి ఉపయోగకరంగా లేకుండా పోయానని మనస్థాపానికి గురైన ఓ యువకుడు మంగళవారం ఇంట్లో ఫ్యాన్ ఉక్కుకు నైలాన్ తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు . మహ రాష్ట్ర వసీం జిల్లాకు చెందిన నాజియా బేగం తన తండ్రి ఇద్దరు కుమారులతో కలిసి ఓవైసీ హిల్స్ చాంద్ తారా మసీద్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. నజియా బేగం పెద్ద కుమారుడు ఇర్షాద్ ఖాన్ (21) ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు. కొంతకాలం బ్యాగుల దుకాణం లో, డీ మార్ట్ లో పనిచేశాడు. తరువాత పని దొరకక రెండు నెలల నుంచి ఇంట్లోనే ఉంటున్నాడు. దీంతో అతను మానసికంగా కృంగి పోయి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ ఉక్కు కు నైలాన్ తాడు తో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న మైలార్ దేవుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఆలయ కమిటీ ప్రతినిధులతో సంగీతారెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, కార్పొరేటర్ సంగీత

# రాంభాగ్ దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన కొండా సంగీత విశ్వేశ్వర్ రెడ్డి



రాంబాబు దుర్గామాత ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న అపోలో జాయింట్ డైరెక్టర్ సంగీతారెడ్డి

రాజేంద్రనగర్,మార్చి12(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ లో గల రాంబాగ్ దుర్గామాత అమ్మవారిని అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కొండ సంగీత విశ్వేశ్వర్ రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. బిజెపి పార్టీ నాయకులతో కలిసి ఆలయంలో దుర్గామాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కొండ సంగీత విశ్వేశ్వర్ రెడ్డిని ఆశీర్వదించారు. తదనంతరం శ్రీశ్రీశ్రీ కమలానంద భారతి,శ్రీశ్రీశ్రీ వీరానంద స్వామి,శ్రీశ్రీ శంకరనాంద స్వామితో దేవాలయాల పరిరక్షణ, సనాతన ధర్మం గురించి జరిగిన కార్యక్రమంలో కొండ సంగీత పాల్గొని అమ్మవారి విశిష్టతను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఆలయ కమిటీ సభ్యులు,అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్,భక్తులు,ప్రజలు,వానరాసేన అధ్యక్షులు,జనహిత వెల్ఫేర్ సోసైటీ అధ్యక్షురాలు ఉమామహేశ్వర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ తాగునీటి అవసరాలకు సరిపడా నీరు

**జలాశయాల్లో తగినంత నీటి నిల్వలు**
**అదనపు జలాల కోసం**
**ఎమర్జెన్సీ పంపింగ్‌కు ఏర్పాట్లు**
**ప్రజలెవరూ ఆందోళనకు గురి కావద్దని**
**జలమండలి విజ్ఞప్తి**



హైదరాబాద్, మార్చి 13(ప్రభాత ఉదయం) ఈ వేసవిలో హైదరాబాద్ మహానగర ప్రజల తాగు నీటి అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నాయని..అందువల్ల నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని జలమండలి స్పష్టం చేస్తోంది.ప్రధాన జలాశయాలైన నాగార్జున సాగర్,శ్రీశైలం ప్రాజెక్టుల్లో సరిపడా నీరు లేనందున..నగర వాసులకు తాగునీటి సమస్య తలెత్తుతుందని కొన్ని వార్తా పత్రికలు కథనాలు ప్రచురించాయి.ఈ నేపథ్యంలో జలమండలి ఈ విషయంపై క్లారిటీ ఇస్తుంది.ఓఆర్ఆర్ వరకు విస్తరించిన హైదరాబాద్ మహా నగర వాసుల తాగునీటి అవసరాల కోసం జలమండలి.. నాగార్జున సాగర్ జలాశయం,అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజ్- 1, 2, 3 ల ద్వారా రోజుకి 270 ఎంజీడీల నీటిని తరలిస్తోంది.ఈ లెక్కన నెలకు 1.38 టీఎంసీల నీటిని సరఫరా చేస్తుంది.అయితే ( 12.03.2024) నాటికి నాగార్జున సాగర్ నీటి నిల్వ సామర్థ్యం 138.73 టీఎంసీ, 514.10 అడుగులు ఉంది.గతేడాది ఇదే రోజున 187.07 టీఎంసీలు,539.40 అడుగుల నీరు ఉంది.ప్రస్తుతం రిజర్వాయర్ లో డెడ్ స్టోరేజీ లెవల్ పైన (510 అడుగుల పైన) 7.06 టీఎంసీల నీటి లభ్యత ఉంది. కాబట్టి.. ఈ వేసవిలో హైదరాబాద్ నగరానికి తాగునీటి కొరత ఉండదు.జలమండలి అధికారులు ఎప్పటికప్పుడు ప్రాజెక్టు పరిస్థితుల్ని పర్యవేక్షిస్తున్నారు.నగరానికి అవసరమైన 270 ఎంజీడీల నీరు సరఫరా చేయడానికి ఎలాంటి ఆటంకాలు ఉండవు.రానున్న నాలుగు నెలల వరకు అనగా ఈ జులై చివరి నాటికి కావాల్సిన నీరు సరఫరా చేసేందుకు ఎమర్జెన్సీ పంపింగ్ ఏర్పాట్ల పనులు పూర్తి కావస్తున్నాయి.జలాశయంలో నీటి మట్టం 510 అడుగులకు చేరగానే..ఈ ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా హైదరాబాద్ కు సరిపడా నీటిని సరఫరా చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటామని జలమండలి తెలిపింది.మరోవైపు గోదావరి జలాల కోసం ఎల్లంపల్లి జలాశయంలో డెడ్ స్టోరేజీ నుంచి నీటిని తరలించేందుకు అత్యవసర పంపింగ్ చేయడానికి అవసరమైన ప్రక్రియ మొదలు పెట్టింది. దీంతో పాటు అవసరాన్ని బట్టి ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాల నుంచి అదనపు జలాలను తరలించేందుకు సమాయత్తమవుతోంది.ఇవే కాకుండా.. సింగూరు,మంజీరా జలాశయాల్లో సంతృప్తికరమైన నీటి నిల్వలు ఉన్నాయి. కాబట్టి.. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది ఉండదు.అందువల్ల నగర ప్రజలు ఎలాంటి ఆందోళనలకు గురి కావద్దని జలమండలి విజ్ఞప్తి చేస్తోంది.




## ఇందిరానగర్ నూతన కార్యవర్గాన్ని అభినందించిన కార్పొరేటర్ రవీందర్ రెడ్డి

కూకట్‌పల్లి, మార్చి 12 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ లో జరిగిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్థానిక డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ చైర్మన్ నరసింహా రెడ్డి, నూతన అధ్యక్షులు గిరి సాగర్, ప్రధాన కార్యదర్శి అర్జున్, కోశాధికారి రాజు ముదిరాజ్ తో పాటు కార్యనిర్వాహక సభ్యులు మరియు స్థానికులు పాల్గొన్నారు

### వాహనాల రిజిస్ట్రేషన్ మార్క్

# టీఎస్ నుంచి టీజీకి మార్పు

### కేంద్ర ప్రభుత్వ నోటిఫికేషన్ జారీ




హైదరాబాద్, మార్చి 12 (ప్రభాత ఉదయం): తెలంగాణలో వాహనాల రిజిస్ట్రేషన్ మార్క్‌ను టీఎస్ నుంచి టీజీకి మారుస్తూ కేంద్ర రహదారి రవాణాశాఖ మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. మోటారు వాహనాల చట్టం 1988లోని సెక్షన్ 41(6) కింద ఉన్న అధికారాలను ఉపయోగించి.. 1989 జూన్ 12న అప్పటి ఉపరితల రవాణా శాఖ జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో ఈ మార్పు చేసినట్లు తెలిపింది. ఆ నోటిఫికేషన్‌లోని టేబుల్‌లో సీరియల్ నంబర్ 29ఏ కింద.. తెలంగాణ రాష్ట్రానికి ఇదివరకు ఉన్న టీఎస్ స్థానంలో ఇప్పుడు టీజీ మార్క్ కేటాయించినట్లు వెల్లడించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత వాహన రిజిస్ట్రేషన్ మార్క్‌లో మార్పు చేయాలని నిర్ణయించారు. ఆమేరకు రాష్ట్ర మంత్రివర్గంలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారు. దాన్ని అనుసరించి కేంద్ర ప్రభుత్వం మార్పు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇకనుంచి రిజిస్టర్ అయ్యే వాహనాల మార్క్ టీజీగా మారనుంది.

# బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా శంభీపూర్ రాజు

హైదరాబాద్, మార్చి 12 (ప్రభాత ఉదయం): మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థిని బీఆర్ఎస్ పార్టీ ఖరారు చేసింది. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పోటీ చేయడానికి అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పోటీ నుంచి మాజీ మంత్రి మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డి తప్పుకోవడంతో శంభీపూర్ రాజుకు అవకాశం ఇస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. శంభీపూర్ రాజు.. తెలంగాణ ఉద్యమం సమయం నుంచి కేసీఆర్ వెంట ఉన్నారు. గతంలో ఆయన కుత్బుల్లాపూర్ నుంచి పోటీ చేయాలని అనుకున్నారు. కానీ గత మూడు ఎన్నికల్లోనూ చాన్స్ లభించలేదు. ఈ కారణంగా కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ టిక్కెట్ ఆశించారు. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యేలకే సీట్లు కేటాయించే క్రమంలో కేపీ వివేకానంద్ కే కేసీఆర్ టిక్కెట్ ఇచ్చారు. మొదట అసంతృప్తి వ్యక్తం చేసినా తర్వాత పార్టీ గెలుపు కోసం పని చేశారు. అదే సమయంలో మల్కాజిగిరి టిక్కెట్ ఇచ్చినప్పటికీ పార్టీని వీడిన మైనంపల్లి హన్మంతరావు ప్లేస్‌లో పోటీ చేయడానికి ఆసక్తి చూపించారు. అయితే మల్లారెడ్డి అల్లుడు రాజశేఖర్ రెడ్డి ఆసక్తి చూపడంతో ఆయనకు చాన్సిచ్చారు. ఈ కారణంగా ఎన్నికల్లో పోటీ చేయలేకపోయారు. ఇప్పుడు కూడా మల్కాజిగిరి ఎంపీ స్థానానికి మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డి పోటీ చేయాలనుకున్నారు. కానీ కాంగ్రెస్ పా ర్టీ నుంచి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉండటంతో పోటీ నుంచి విరమించుకున్నారు. ఈ కారణంగా ఎన్నాళ్ల నుంచో చూస్తున్న టిక్కెట్ శంభీపూర్ రాజుకు లభించింది. అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్ సభ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు భారీ విజయం సాధించారు. అన్ని సెగ్మెంట్లలో కలిపి మూడున్నర లక్షల ఓట్ల మెజార్టీ వచ్చింది. విజయం సునాయాసం అనుకున్నప్పటికీ అభ్యర్థులు వెనుకడుగు వేయడంతో శంభీపూర్ రాజుకు చాన్సిచ్చారు. 30 లక్షల పైచిలుకు ఓటర్లతో దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గంగా ఉన్న మల్కాజ్‌గిరి పార్లమెంట్ సెగ్మెంట్‌పై ప్రధాన పార్టీలు కన్నేశాయి. ఈ నియోజకవర్గాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. పక్కా వ్యూహంతో బీజేపీ ఈటల రాజేందర్‌ను అభ్యర్థిగా బరిలోకి దిపింది. సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ప్లాన్‌లు వేస్తున్నారు. కాంగ్రెస్ కంటే ముందే అభ్యర్థిని ప్రకటించి బీజేపీ రంగంలోకి దింపింది. కాంగ్రెస్ ఇంకా అభ్యర్థిని ఖరారు చేయలేదు.

### తెలంగాణలో ప్రధాని మోదీ

# షెడ్యూల్ ఖరారు

### 3 రోజుల పర్యటనలో బహిరంగ సభల్లో పాల్గొనే అవకాశం!

హైదరాబాద్, మార్చి 12 (ప్రభాత ఉదయం): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. తెలంగాణ రాష్ట్రంలో భారీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ ప్రచారాన్ని వేగవంతం చేసింది. ఇప్పటికే, రాష్ట్రంలో బీజేపీ అగ్రనేతలు పర్యటించిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి తెలంగాణలో పర్యటించనున్నారు. ఈ మేరకు మోదీ షెడ్యూల్ పర్యాటన ఖరారు అయింది. మార్చి 16 నుంచి 18,19వ తేదీల్లో మోదీ పర్యటించనున్నారు. 3 రోజుల పర్యటనలో భాగంగా మోదీ మల్కాజ్‌గిరి, నాగర్ కర్నూల్, జగిత్యాల బహిరంగ సభల్లో పాల్గొనే అవకాశముందని తెలంగాణ బీజేపీ నేతలు వెల్లడించారు. ఈ నెల15 న మల్కాజ్ గిరిలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. హైదారాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరీ పార్లమెంట్ స్థానాలు కలిపి మల్కాజిగిరీలో సభను నిర్వహించనున్నారు. మార్చి 16న మహబూబ్ నగర్, నల్లగొండ, నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానాలు కలిపి నాగర్ కర్నూల్‌లో సభ, మార్చి 18న జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ కలిపి జగిత్యాల వేదికగా బహిరంగ సభను నిర్వహించనున్నారు. ఇప్పటికే, తెలంగాణలో ఈనెల 4, 5 తేదీల్లో మోదీ పర్యటించిన సంగతి తెలిసిందే. రెండు రోజుల పాటు పర్యటనలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. తెలంగాణ బీజేపీ ఆధ్వర్యంలోని అనేక సభల్లో మోదీ పాల్గొన్నారు.

# టీఎస్ పీఈసెట్-2024 నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, మార్చి 12 (ప్రభాత ఉదయం): తెలంగాణలోని వ్యాయామ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీఎస్ పీఈసెట్- 2024 నోటిఫికేషన్ మార్చి 12న విడుదలైంది. దీనిద్వారా బీపీఎడ్, డీపీఎడ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. తెలంగాణలోని వ్యాయామ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీఎస్ పీఈసెట్- 2024 నోటిఫికేషన్ మార్చి 12న విడుదలైంది. దీనిద్వారా బీపీఎడ్, డీపీఎడ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ప్రకటించిన షెడ్యూలు.. అర్హులైన అభ్యర్థులు మార్చి 14 నుంచి మే 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. అయితే ఆలస్య రుసుముతో మే 31 వరకు దరఖాస్తుల్ని సమర్పించవచ్చు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూన్ 10 నుంచి 13 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. జూన్ నాలుగో వారంలో ఫలితాల్ని విడుదల చేయనున్నారు. దరఖాస్తు ఫీజుగా అభ్యర్థుల నుంచి రూ.900 చెల్లించాల్సి ఉంటుంది. ఇక ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.500 చెల్లిస్తే సరిపోతుంది. ఈ ఏడాది టీఎస్ పీఈసెట్‌ను శాతవాహన యూనివర్సిటీ నిర్వహించనుంది. పీఈసెట్ ద్వారా రాష్ట్రంలోని 16 బీపీఎడ్ కాలేజీల్లో 1660 సీట్లు, నాలుగు డీపీఎడ్ కాలేజీల్లో 350 సీట్లను భర్తీ చేయనున్నారు.

## కేంద్ర హోం మంత్రి సభకు తరలిన బిజెపి మహిళా మోర్చా ప్రతినిధులు



హైదరాబాద్, మార్చి 12 (ప్రభాత ఉదయం) కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభకు రాష్ట్ర బిజెపి మహిళా మోర్చా ప్రతినిధులు తరలి వెళ్లారు. మంగళవారం నగరంలో జరిగిన అమిత్ షా సభకు భారీ సంఖ్యలో మహిళా మోర్చా ప్రతినిధులు హాజరయ్యారు.






## పాఠశాల సిబ్బందికి శ్రీరంగం ఫౌండేషన్ ఆర్థిక చేయూత

### ఆర్థిక సాయం అందించిన శ్రీరంగం ఫౌండేషన్

కూకట్‌పల్లి, మార్చి 12 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం కే పీ హెచ్ బి కాలనీలోని భువన విజయం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనా రాజ కుమారి గతంలో ఇద్దరు ఉపాధ్యాయులు, పాఠశాలలోని తరగతి గదులు శుభ్రం చేసే వ్యక్తికి వేతనాన్ని ఇవ్వమని శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ డా. సత్యం శ్రీరంగం ని కోరగా శ్రీరంగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇచ్చిన మాట ప్రకారం ఫిబ్రవరి నెల వేతనాన్ని కూడా శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్మన్ ఇందుమతి శ్రీరంగం చేతులమీదుగా పాఠశాలలో అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగం ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బస్తీ వాసులు

## ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ప్రారంబించిన కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు

కూకట్‌పల్లి, మార్చి 12 (ప్రభాత ఉదయం) కె పి హెచ్ బి డివిజన్ 3వ ఫేస్ రమ్య గ్రౌండ్ వద్ద భవన నిర్మాణ కార్మికులు ఏర్పాటు చేసిన చలివేంద్రంను స్థానిక డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వేసవికాలంలో ఎంతోమంది దాహార్తి తీర్చే చలివేంద్రం ప్రారంభించడం సంతోషకరమని మానవసేవే మాధవసేవగా ముందుకు వెళుతున్న భవన నిర్మాణ కార్మికులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సాంబశివరావు, శ్రీకాంత్ ,ప్రకాష్, వేగానందం, సలీం ,ఏడుకొండలు,రంజిత్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ముదిరాజ్, రాంబాబు నాయుడు, మహబూబ్ కచ్చిన్, మూర్తి, పద్మ, అనురాధ, కుమారి, స్వరూప, మమత తదితరులు తదితరులు పాల్గొన్నారు.


ఎస్ టి పి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

## ఎస్ టి పి ప్లాంట్ పనులను త్వరతిగతిన పూర్తి చేయాలి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, మార్చి 12 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని ఖాజా కుంట చెరువు వద్ద నిర్మిస్తున్న ఎస్.టి.పి ప్లాంట్ పనులను మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో నాటి సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో ఎస్ .టి. పి ప్లాంట్ల నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించామన్నారు. కాజా కుంట చెరువు ప్లాంట్ పనులకు 390 కోట్ల నిధులు మంజూరు చేసి పనులు చేపట్టామని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ... అధికారులు సత్వరమే పనులు పూర్తి చేయాలని ఆయన సూచించారు. పనుల్లో జాప్యం జరుగుతోందని త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్లాంట్ ని అందు బాటులోకి తీసుకురావాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు సంతోష్ అధికారులు పాల్గొన్నారు.


ధోబి ఘాట్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

## దోబిఘాట్ సమస్యల పరిష్కారానికి కృషి: కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

కూకట్‌పల్లి, మార్చి 12 (ప్రభాత ఉదయం) మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని శోభనా కాలనీ దోబిఘాట్ లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో 40 లక్షలతో నిర్మిస్తున్న కమిటీ హాల్ భవనాన్ని మంగళవారం డిఈ శ్రీదేవి తో కలిసి కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, స్థానిక రజక సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. పర్యవేక్షణలో భాగంగా ధోబి ఘాట్ రజక కులస్తులకు ఉన్న అనుమానాలను డిఈ శ్రీదేవితో కలిసి నివృత్తి చేశారు. కమ్యూనిటీ హాల్ కు సంబంధించి ప్రహరీ కావాలని కోరడంతో సానుకూలంగా స్పందిస్తూ కట్టిస్తామని హామీ ఇచ్చారు. బస్తీ ప్రజలు తమ ప్రాంతంలో ఉన్న సమస్యలను నా దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, భాగయ్య ,అశోక్, శీను, సురేందర్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.